ప్రజాశక్తి

గురువారం 30 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పట్టణాలు, నగరాల్లో..

మౌలిక సదుపాయాలపై చర్చ

- ఆర్థిక వనరులు, ప్రైవేటు పెట్టుబడులపై అభిప్రాయాలు వ్యక్తపరిచిన ప్రతినిధులు
- ముగిసిన జి 20 ఐడబ్ల్యుజి సమావేశాలు
- నేడు, రేపు వర్క్‌షాప్‌లు



సమావేశంలో పాల్గొన్న జి - 20 దేశాల ప్రతినిధులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

విశాఖ నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో రెండు రోజులపాటు జరిగిన జి 20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (ఐడబ్ల్యుజి) - 2 సమావేశాల్లో పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై సుదీర్ఘ చర్చలు సాగాయి. ఆర్థిక వనరులు, ప్రైవేటు పెట్టుబడులపై విదేశీ ప్రతినిధులు అభిప్రాయాలు వ్యక్తపరిచారు. మంగళవారం ఘనంగా ప్రారంభమైన ఈ సమావేశాలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి.

బుధవారం ఉదయం 5 గంటలకు సాగర్‌నగర్ బీచ్‌లో ప్రతినిధుల యోగా, ఇతర ఆరోగ్య అంశాలపై శిక్షణతో రెండో రోజు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజైన మంగళవారం ప్రపంచంలో అమల్లో ఉన్న ఫైనాన్షియల్ మోడల్స్, థీమ్స్ అన్నిటినీ వేర్వేరు అజెండాలుగా చేసుకుని చర్చలు సాగించిన విషయం తెలిసిందే. రెండో రోజు ఆ చర్చలు మరింత సుదీర్ఘంగా సాగాయి. వెరసి ఏడు సెషన్లు, ఒక వర్క్‌షాప్‌తో ఈ సమావేశాలు జయప్రదమైనట్టు నిర్వాహకులు తెలిపారు.

జి-20 దేశాలకు చెందిన 57 మంది ప్రతినిధులు, 8 మంది ఆహ్వానితులు పాల్గొన్నట్టు వెల్లడించారు. పది అంతర్జాతీయ సంస్థలూ భాగస్వాములయ్యాయన్నారు. సమావేశాల ముగింపు సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ సోలోమన్ అరోక్యరాజ్ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గొప్పతనాన్ని, ఇక్కడి సాంస్కృతిక వారసత్వ వికాసాన్ని, పర్యాటక ప్రదేశాలను ప్రతినిధులంతా తిలకించి పులకించారన్నారు.

నేడు కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్

గురువారం జి-20 దేశాలకు చెందిన కొంతమంది ప్రతినిధులతో నగరాలు, పట్టణాల్లో కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ జరుగనుంది. కొరియా, సింగపూర్‌లకు చెందిన అంతర్జాతీయ నిపుణులు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుకూలతలు, ప్రతికూలతలపైనా, విజయవంతమైన ప్రాజెక్టులపైనా శిక్షణ ఇవ్వనున్నారు. తొలుత మెట్రోపాలిటన్ నగరాల విజయాలపై దక్షిణ కొరియా స్పీకర్ మాట్లాడతారు. సింగపూర్ మిగతా 2లో..



యోగా సాధనలో విదేశీ ప్రతినిధులు



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

టెన్త్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి బుధవారం విశాఖ జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీసు, విద్యాశాఖ, వైద్యశాఖ, పోస్టల్, ఆర్‌టిసి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ పరీక్షల నిర్వహణను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గత సంవత్సరం పరీక్షల నిర్వహణలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చర్యలు మిగతా 2లో..

ఘనంగా ఐఐఎం స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవి) ఏడో వార్షిక స్నాతకోత్సవం బుధవారం విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో ఘనంగా జరిగింది. మొత్తం 239 మంది విద్యార్థులు పట్టభద్రులయ్యారు. ముఖ్య అతిథిగా రిషిహుడ్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్, కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు స్థిరమైన నిర్ణయాలతో ముందుకు సాగాలన్నారు. సహజ వనరుల మిగతా 2లో..



పట్టాలు పొందిన విద్యార్థులు

ఎల్ఐసి పెన్షనర్ల నిరసన

▸ వార్త 2లో..

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య

▸ వార్త మెయిన్‌లో..

'ఉక్కు'పై ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ధర్నా

▸ వార్త 4లో..

ఘోర రోడ్డు ప్రమాదం

- సీతారామపురం వద్ద నిలిచిన ట్రాలీని ఢీకొన్న కారు
- తల్లీ కొడుకు దుర్మరణం - నలుగురికి తీవ్ర గాయాలు
- బాధితులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు
- మల్కాపురంలో విషాదఛాయలు

ప్రజాశక్తి - పాయకరావుపేట : మండలంలోని సీతారామపురం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచిన భారీ ట్రాలీని వెనుకనుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారు, గాయపడ్డ వారు ఒకే కుటుంబానికి చెందినవారు. దీంతో వారి స్వస్థలమైన విశాఖలోని మిగతా 2లో..



భారతి, మోహన్ బాలాజీ మృతదేహాలు

మొదటి పేజీ తరువాయి..

మౌలిక సదుపాయాలపై చర్చ

స్పీకర్ నగరాల్లో నాణ్యమైన జీవనం, పట్టణ ప్రణాళికా విభాగాల పనిపైన విశ్లేషిస్తారు. వర్క్‌షాప్‌లో 'వైజాగ్ అర్బన్ కేస్ స్టడీ' అంశాలూ అజెండాగా ఉండనున్నాయి. విశాఖలోని ముడసర్లోవ ఫ్లోటింగ్ ప్రాజెక్టు, 24 గంటల నీటి సరఫరాకు కృషి, వేస్ట్ వాటర్ మేనేజిమెంట్‌పై జరుగుతున్న కృషిని ప్రతినిధులు వివరిస్తారు. శుక్రవారం కూడా సమావేశాలు కొనసాగనున్నాయి. దేశంలోని మున్సిపల్ కమిషనర్లు సుమారు 50 మంది హాజరవుతున్నారు. యూనివర్సిటీల వైస్‌ఛాన్సలర్లు, ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్, ఎంపిక చేయబడిన విద్యాసంస్థల విద్యార్థులతో సమావేశం జరుగుతుంది.

టెన్త్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి

తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్షా కేంద్రాల వద్ద మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ నిరంతర సరఫరా ఉండాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌టిసి అధికారులు విద్యార్థులకు అవసరమైన బస్సులు నడపాలని, విద్యార్థుల హాలు టికెట్‌ను బస్సు పాస్‌గా పరిగణించి ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతిరోజూ పరీక్షా కేంద్రాలను కలెక్టర్లు సందర్శించాలని తెలిపారు. సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచీ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించకూడదన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టరు ఎ.మల్లికార్జున పాల్గొన్నారు.

ఘనంగా ఐఐఎం స్నాతకోత్సవం

నిర్వహణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో సవాళ్లను ఎదుర్కోవాలన్నారు. ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎమ్.చంద్రశేఖర్ మాట్లాడుతూ పిజిపి విద్యార్థులు ప్లేస్‌మెంట్ సీజన్‌లో సగటున రూ.16.6 లక్షల జీతంతో రికార్డు సృష్టించారన్నారు. అనంతరం ఆయన ప్రతిష్టాత్మకమైన ఎంజిఎన్‌ఎఫ్ ప్రోగ్రామ్‌ను వివరించారు. ప్రతిభ కనబరిచిన వారికి అతిథులు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందించారు.

ఘోర రోడ్డు ప్రమాదం

మల్కాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నంలోని మల్కాపురానికి చెందిన నేవీ ఉద్యోగి కోళ్ల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు అమలాపురం దగ్గర గన్నవరంలో తమ బంధువు అంత్యక్రియలకు హాజరై మంగళవారం రాత్రి తమ స్వస్థలానికి తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారు సీతారామపురం వద్ద జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన ట్రాలీని బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో శ్రీనివాసరావు కారు నడుపుతున్నారు. అర్ధరాత్రి సమయంలో నిద్రమత్తులో రోడ్డు పక్కన నిలిపిన వాహనాన్ని గమనించకపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కోళ్ల శ్రీనివాసరావు భార్య కోళ్ల భారతి (44), కుమారుడు కోళ్ల మోహన్ బాలాజీ (18) దుర్మరణం చెందారు. భారతి గృహిణి. కుమారుడు మోహన్ బాలాజీ ఆంధ్రా యూనివర్సిటీలో బి.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఘటనలో కోళ్ల శ్రీనివాసరావు, అతని కుమార్తె కోళ్ల హేమన్యా వెంకటస్వార్తి, తల్లి కోళ్ల వరలక్ష్మి, సోదరి కొల్లాటి ధనలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. వారిని విశాఖపట్నంలోని కిమ్స్ హాస్పిటల్‌కి తరలించారు. భారతి, మోహన్ బాలాజీ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సిఐ పాలిన అప్పలరాజు ఆదేశాలతో ఎస్ఐ జోగారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఐసి పెన్షనర్ల నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమస్యలను పరిష్కరించాలంటూ ఐసిఆర్ఇఎ, ఐసిఇయు ఆధ్వర్యంలో బుధవారం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం వద్ద పెన్షనర్లు, ఉద్యోగులు సంయుక్తంగా నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్రదర్శన చేపట్టారు. ఉద్యోగి చివరి బేసిక్ పే పై 30 శాతం కుటుంబ పెన్షన్ ఇవ్వాలని, ఉద్యోగుల వేతన సవరణ సందర్భంగా పెన్షన్ అప్డేషన్ చెయ్యాలని, ఉద్యోగుల డిసిపిఎస్‌లో యాజమాన్య వాటా పెంచాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి పెన్షనర్ల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు కె.మోహన్ రావు మాట్లాడుతూ ఎల్ఐసి పెన్షనర్ల సమస్యలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. పెన్షనర్లకు 30 శాతం కుటుంబ పెన్షన్ ఇవ్వవలసిన అవసరాన్ని, బాధ్యతను గుర్తించి, దాని వల్ల అయ్యే ఖర్చును బేరీజు వేసుకొని మూడున్నరేళ్ల క్రితం ఎల్ఐసి బోర్డు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని, నేటికీ ఆ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని ఉధృతం చేయనున్నామన్నారు. అనంతరం ఐసిఇయు ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐఆర్ఇఎ ప్రధాన కార్యదర్శి ఆర్.పాండు రంగన్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు, ఉద్యోగులు

రేపు మన్యం బంద్

- బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానంపై గిరిజనుల ఆగ్రహం
- ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- ప్రమాణాల ఉల్లంఘనపై నోరువిప్పని ఏజెన్సీ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రాయలసీమ ప్రాంతంలోని బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ ఈ నెల 24న శాసనసభలో చేసిన తీర్మానంపై ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించకుండా ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై గిరిజన సంఘం శుక్రవారం మన్యం బంద్‌కు పిలుపునిచ్చింది. ఇప్పటికే బంద్ జయప్రదానికి ఏజెన్సీ అంతటా విస్తృత ప్రచారం జరుగుతోంది. మరోవైపు ప్రభుత్వ నిర్ణయంపై గ్రామాల్లోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చడం కోసం బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నామన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. రద్దు చేసిన జిఒ 3 పునరుద్ధరణను మాత్రం రెండున్నరేళ్లుగా ఎందుకు పట్టించుకోవడం లేదని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. గిరిజన యువతకు ఉద్యోగ నియామకాల్లో నూరు శాతం రిజర్వేషన్ కల్పించిన జిఒ 3కు చట్టబద్ధత కల్పించడంలో ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకోలేదన్న విమర్శలున్నాయి.

ప్రమాణాల పాటింపేదీ ?

రాయలసీమ ప్రాంతంలోని బిసి - ఎలో ఉన్న బోయ/వాల్మీకిలను ఎస్‌టి హోదాలో చేర్చాలని తీర్మానం చేయడానికి ప్రభుత్వం కొన్ని ప్రమాణాలు పాటించాల్సివుంది. ఒక తెగను/సమూహాలనుగానీ షెడ్యూల్ తెగలుగా గుర్తించేందుకు లోకూర్ కమిటీ కొన్ని ప్రమాణాలను నిర్దేశించింది. ఆ ప్రకారం.. ఆహార సేకరణ, పోడు వ్యవసాయం, ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, భాష, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, కళలు, ప్రత్యేక నివాసిత ప్రాంతం, విద్య, ఆరోగ్యం, ఆదాయం, వెనుకబాటుతనం వంటివన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. కానీ ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోలేదు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శామ్యూల్ ఆనందకుమార్ సిఫార్సుల ప్రకారం తీర్మానం చేసింది తప్ప, తెగను గుర్తించేందుకు లోకూర్ కమిటీ చేసిన సిఫార్సులను గాలికొదిలేసింది. ప్రభుత్వం తనకు నచ్చిన వ్యక్తితో ఏకసభ్య కమిషన్‌ను నియమించి, ఆయనిచ్చిన నివేదిక ఆధారంగా తీర్మానం చేయడానికి వీల్లేదని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం బిసికి చెందిన బోయ/వాల్మీకిలకు గిరిజన తెగ లక్షణాలున్నాయని గిరిజన సంస్కృతి, పరిశోధన సంస్థ ఎటువంటి సిఫార్సూ చేయలేదు. కనీసం పరిశోధన సంస్థను ప్రభుత్వం సంప్రదించలేదు. కనీసం ఆ సంస్థ నుంచి ఏ సమాచారమూ, సూచననూ తీసుకోనూలేదు. ఆంత్రోపాలాజికల్ సర్వే నిర్వహించకుండా ఇచ్చిన నివేదికకు విలువవుండదని పలువురు అంటున్నారు. గిరిజన తెగకు చెందినవారన్న ప్రాథమిక ఆధారాలేవీ బోయ/వాల్మీకిలకు లేనప్పటికీ ఎస్‌టి జాబితాలో చేర్చాలని తీర్మానం చేయడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై గిరిజన సలహా మండలి తీర్మానం కూడా లేదు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని తీర్మానం చేయడంపై పాడేరు, అరకు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఫాల్గుణ, ఎంపీ మాధవి అభ్యంతరం చెప్పకపోవడంపై గిరిజనులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాజశేఖరరెడ్డి, చంద్రబాబు ప్రభుత్వాలు బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ప్రయత్నించి, గిరిజనుల వ్యతిరేకతతో వెనక్కుతగ్గారు. గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం తీర్మానం చేసి ఆదివాసీలపై దాడికి దిగింది. దీంతో ఏజెన్సీ అంతటా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

గిరిజనులకు అన్యాయం

గిరిజనులకు ఉన్న సంస్కృతి, సామాజిక సంబంధాలు బోయ/వాల్మీకిలకు లేనందున వారిని గిరిజనులుగా గుర్తించేందుకు వీల్లేదు. అభివృద్ధి చెందిన బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చితే మారుమూలలున్న గిరిజనులకు అన్యాయం జరుగుతుంది.



డాక్టర్ వివిఎన్‌వికె.శాస్త్రి,
విశ్రాంత గిరిజన సంస్కృతి, పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్

మా స్థలాన్ని కాపాడరూ..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తమ పూర్వీకుల వారసత్వంగా వచ్చిన భూమిని కాజేయడానికి ప్రయత్నిస్తున్న వారి నుంచి కాపాడాలని వృద్ధ దంపతులు ఒనిమి సన్యాసిరావు, అప్పల నరసమ్మ కోరారు. బుధవారం ఉదయం వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ నగర పోలీసు కమిషనర్ కార్యాలయానికి వచ్చి సిపి శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం ఆటోనగర్ ప్లాట్ నెంబర్ 30లోని తమ స్థలాన్ని పోషణార్థం శరగడం శ్రీరామ్ అనే వ్యక్తికి 2015 డిసెంబర్ 7న అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. ఆ స్థలంలో మహాలక్ష్మి ఎర్త్ మూవర్స్ పేరుతో సంస్థ నడపడానికి నెలకు రూ.25 వేలు చొప్పున అద్దె కోసం ఒప్పంద పత్రం రాసుకున్నామన్నారు. 2018 ఆగస్టు నుంచి సక్రమంగా అద్దె చెల్లించకుండా సదరు వ్యక్తి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు.

కుట్టు మిషన్ల వితరణ

ప్రజాశక్తి -కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్ బీచ్‌రోడ్‌లోని బాలవికాస ఫౌండేషన్ సంస్థ నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రానికి యూనియన్ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో కుట్టుమిషన్లను అందజేసింది. ఒక జ్యూట్ సంచుల తయారీ మిషన్, మూడు సాధారణ కుట్టుమిషన్లను బ్యాంక్ జనరల్ మేనేజర్ కెఎస్‌డి.శివ వరప్రసాద్ కుట్టుశిక్షణ కేంద్రానికి అందజేశారు. మహిళల స్వయంఉపాధికి చేయూతలో భాగంగా బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో వీటిని అందజేశామన్నారు.

బాలలకు ఇబ్బంది కలిగితే చర్యలు

ఎంవిపి కాలనీ : కరకచెట్టు పోలమాంబ వార్షిక జాతరకు వచ్చే పిల్లలకు ఇబ్బందులు తలెత్తితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు. బుధవారం దేవాదాయ శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు.

అప్పీలు నోటీసు ప్రకటన

మహారాజశ్రీ చోడవరం 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వారి కోర్టులో

A.S.No. 23/2014 I.A.No. 257/2022

పిటీషన్:
కేశవరపు సూర్యనారాయణమూర్తి వగైరాలు . . . పిటీషనర్లు

అండ్:
బయిన కామేశ్వరరావు వగైరాలు . . . రెస్పాండెంట్లు

టు:
4వ రెస్పాండెంటు:
కశిరెడ్డి సత్యనారాయణ, తండ్రి దేముడు, నర్సింగరావుపేట, డో.నెం.3-3-69, అనకాపల్లి, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు అప్పీలు A.S.No. 23/2014 రు నందు చనిపోయిన అప్పలెంటు కేశవరపు సూర్యనారాయణమూర్తి గారు తే:20-5-2022 దిన చనిపోయిన మీదట తన ముఖ్య వారసులు అయిన భార్య 2వ అప్పలెంటుగాను కుమారుడు 3వ అప్పలెంటుగాను ముఖ్య వారసులుగా చేర్పించుకోరి పైనెంబరున పిటిషను దాఖలు చేసిన మీదట సదరు పిటిషను తే: 28-4-2023దికి పగలు 10-30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరైమనవి చేసుకొ వలెను. లేనిపక్షమందు Exparte ఆర్డరు జారీ కాబడునని యిందుమూలముగా మీకు తెలియపర్చడమైనది.

శ్రీ ఉగ్గిన వెంకట్రావు
చోడవరం పిటిషనర్లు తరపు అడ్వకేటు
తే:29-3-23 చోడవరం, అనకాపల్లి జిల్లా.

IN THE COURT OF THE SPECIAL MAGISTER, TANUKU
C.C. No. 702 / 2020

Petitioner / Complainant:
Jayavarapu Venkata Narasimha Murthy

Respondent / Accused:
Vydyanadham Ramana Babu

నిందితుడి హాజరు నిమిత్తం Sec 82 CRPC ప్రకారం వియించిన ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు గ్రంథముతో ముద్దాయి వైద్యనాధం రమణబాబు, తండ్రి త్రినాధరావు లోగడ విశాఖపట్నం APEPDCL, Zone-2, D.E.Office, Kancharapalem లో ఉద్యోగం చేయుచో దర్శిలా ఇప్పుడ Executive Engineer Opeartion, Near Boddepalli Junction, APEPDCL, Narsipatnamలో ఉద్యోగం చేయుచున్నారు. వీరికి non bailable warrant జారీకాబడి పైనెంబరు 138 Negotiable Instruments Act సెక్షన్ క్రింద కేసు నెంబరు 702/2020 కేసులో నేరానికి పాల్పడిన్నట్లు శ్రీకోర్టు వారి ఎదుట ఫిర్యాదు చేయబడిన్నది. మీపై non bailable warrant జారీ చేయుటకు దారి తీసిన్నది. సదరు వారంటు అమలు జరుపుటకు శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై 27-04-2023 సం॥ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10 గంటలకు స్వయముగా కాని ప్లీడరు ద్వారా గాని హాజరుఅయి మీ వాదనను తెలియ చేసుకోవలసిన్నదిగా లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.

VANGURI VENKATA SATYANARAYANA
Advocate for Complaint
Tanuku, Cell : 9290073222

నోటీసు

మహారాజశ్రీ విశాఖపట్నము ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 324 / 2022

పిటీషన్:
బెహరా సంతోష్, తండ్రి బెహరా నర్సింగరావు అమృత ఆర్కేడ్, ఆనందనగర్, Opp. చైతన్యకాలేజ్, పి.ఎం.పాలెం, విశాఖపట్నం. . . . వాది

అండ్:
బోర విజయకుమార్‌రెడ్డి ... ప్రతివాది

టు:
ప్రతివాది: బోర విజయకుమార్‌రెడ్డి తండ్రి బుషి కేశవరెడ్డి, డో.నెం. 12-141-14, చినముషిడివాడ పెందుర్తి, విశాఖపట్నం-531173.

పై ఉదహరించిన వారి తనకు మీరు వ్రాసి యిచ్చిన ప్రాంసరీనోటు సొమ్ము బకాయి పడివుంది. అసలు మీ వద్ద 20 లక్షలు మీ నుండి వసూలు చేయుటకు గాను మీ మీద పైన వివరించిన వ్యాజ్యము తెచ్చినందు వల్ల సదరు దావాను ప్రత్యుత్తరము చెప్పుటకు గాను 2023 సం॥ 4వ నెల, 6వ తారీఖున పగలు 10-30 గం॥లు స్వతహాగా లేక సరి అయిన భోగట్టా యివ్వబడిన వకీలు ద్వారాగాని లేక సరి అయిన ఏజెంటు మూలంగా పై కోర్టులో హాజరు అయ్యేటట్లు మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతివాదమునకు ఆధారముగా వుద్దేశించ యుండే దస్తావేజులన్నింటికి నీ యొక్క స్లీలు వేసి మీ హాజరుకావలసినని. మీకు ఉత్తర్వు చేయడమైనది.

పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమందు పై వ్యాజ్యమును విమర్శన చేసి తీర్మానించడ మగునని తెలియజేయడమైనది.

R.V.K.NAIDU,
Advocate for Petitioner
Lalitha Colony, Dabagardens,
Dt:29-3-23 Visakhapatnam-530 020

ప్రకటన

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 116 / 2021 I.A. 111 / 2021

వాది (పిటిషనరు)
1. గనిశెట్టి రిశిత మైనరు గార్డియన్ తల్లి గనిశెట్టి వెంకట లక్ష్మి
2. గనిశెట్టి వెంకటలక్ష్మి

ప్రతివాదులు (రెస్పాండెంట్లు)
గనిశెట్టి ఆదినారాయణ వగైరాలు

టు:
3వ ప్రతివాది: గనిశెట్టి సత్యరమేష్ తండ్రి ఆదినారాయణ
5వ ప్రతివాది: లంక జయలక్ష్మి, భర్త ఆదినారాయణ
6వ ప్రతివాది: గనిశెట్టి నాగ అప్పలసురేష్ తండ్రి ఆదినారాయణ

పై నెంబరు దావాలో దావా షెడ్యూలు దాఖలా ఆస్తి యందు వాదులకు రావలసిన వాటా వారికి పంచి ఇవ్వవలసినదిగా కోరుచూ మీ వగైరా ప్రతివాదులపై వాదులు పై నెంబరు దావా చేసియున్నారు.

అంతేగాక, సదరు దావా పర్యవసానం తేలేవరకు దావా షెడ్యూలు దాఖలా ఆస్తులను మీరు ఎట్టి అన్యాక్రాంతములు చేయకుండా మీపై ఇంటరిమ్ ఇంజక్షను జారీ చేయమని ఐ.ఎ. 111/2021ని ఇంజక్షను పిటిషను కూడా పిటిషనరు మీపై దాఖలు చేయగా మీకు దావాలో దావా మీకు సమన్లు నిమిత్తమున్నూ, ఇంజక్షను పిటిషన్‌లో మీ నోటీసుల నిమిత్తమునూ, శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేయుచూ, అందుపై మీకు గల అభ్యంతరములు తెలియజేయమని తే:4-4-2023కి వాయిదా వేయించిరి. గాన ఆ దినం మీరు పై కోర్టు వారి ఎదుట ఉదయం గం.10-30 ని॥లకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానం చేయడమగునని తెలియజేయడమైనది.

డి. ఉమాశంకర్
వాదుల తరుపు అడ్వకేట్, యలమంచిలి
తే:28-3-2023 యలమంచిలి

మెరుగైన ఫలితాలకు కసరత్తు...


ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం

పదో తరగతి ఫలితాల్లో పట్టు సాధించేందుకు అటు ఉపాధ్యాయులు.. ఇటు విద్యార్థులు నిరంతరం సాధన చేస్తున్నారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కార్యాచరణ చేపట్టారు. ఈ పాఠశాలలో 126 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఇందులో 99 మంది ఇంగ్లీష్, 27 మంది తెలుగు మాధ్యమాల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయునికి 9 నుంచి 10 మంది చొప్పున 14 మంది ఉపాధ్యాయులు దత్తత తీసుకున్నారు. తెలివైన వారు, మధ్యస్థం, తక్కువ తెలివి తేటలు ఉన్న వారిని గ్రూపులుగా విభజించి, వారి సామర్థ్యాన్ని అంచనా వేసి ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు.

500 మార్కులు కంటే ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉన్న విద్యార్థులు 25 మందిగా గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. మిగిలిన విద్యార్థులకు మంచి మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి రోజూ రాత్రి సమయాన తల్లి దండ్రులకు ఫోన్ చేసి పిల్లలు ఎలా చదువుతున్నారని ఆరా తీస్తున్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలను సబ్జెక్టు టీచర్లు నివృత్తి చేస్తున్నారు.

భౌతిక, జీవ శాస్త్రం పరీక్షలు రెండూ ఒకే రోజు రావాల్సి రావడంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యే అవకాశముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిరంతర పరిశీలన

రోజూ రాత్రి 9.30 వరకూ, వేకువజామున 4 గంటల నుంచి గంటన్నర పాటు చదువుతున్నాను. ఏ మేరకు చదువుతున్నదీ రోజూ రాత్రి సమయాన గ్రూప్ టీచర్, సబ్జెక్ట్ టీచర్ ఫోన్ చేస్తున్నారు. ఏమైనా సందేహాలు ఉంటే చెప్తున్నాను. వెంటనే నివృత్తి చేస్తున్నారు.



ఎవిఎన్‌కె విశ్వనాథ్
విద్యార్థి

మంచి ఫలితాలను సాధిస్తా

టెన్త్ లో మంచి ఫలితాలనే సాధించి తీరుతా. సైన్స్, గణితంలో చిన్న పాటి సందేహాలు ఉండేవి. వాటిని సబ్జెక్ట్ టీచర్లు నివృత్తి చేశారు. 500 పైబడి మార్కులు వచ్చేలా చదువుతున్నాను.



బంటుపల్లి హరిణి
విద్యార్థిని

స్టడీ అవర్స్‌తో ఉపయోగం

ప్రతి రోజూ సబ్జెక్ట్ టీచర్ ఇచ్చిన పాఠాలను నెమరు వేసుకుంటున్నాను. స్టడీ అవర్స్ బాగానే ఉపయోగ పడుతున్నాయి. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తానన్న నమ్మకం ఉంది.



రామసింగి రమ్య
విద్యార్థిని

ఉపాధ్యాయుల సమిష్టి కృషి

గతేడాది కంటే మరింత మెరుగ్గా ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులంతా సమిష్టిగా పనిచేస్తున్నాం. మార్చిలో రాష్ట్ర విద్యాశాఖ అందజేసే పరీక్ష పేపర్ల ఆధారంగా (సిలబస్ అంతా ఒకే సారి), సంసిద్ధత పరీక్ష జిల్లా విద్యా శాఖ సూచనలతో నిర్వహించే ప్రీ ఫైనల్ (రెండు భాగాలుగా సిలబస్) పరీక్షలు నిర్వహించాం. ఈ ఏడాది టెన్త్‌లో శత శాతం ఫలితాలే లక్ష్యంగా పని చేస్తున్నాం.



పొట్నూరు మురళీ మోహనరావు
ప్రధానోపాధ్యాయులు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఇష్టపడి చదవాలి

టెన్త్ విద్యార్థులు ప్రణాళిక ప్రకారం ఇష్ట పడి చదవాలి. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. యుటిఎఫ్ ఆధ్వర్యాన ఇప్పటికే జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు ఉచితంగా అందజేశాం.



ఎల్‌వి శ్రీనివాసరావు
యుటిఎఫ్ భీమిలి
మండల అధ్యక్షులు

నేరాలు ఘోరాలు

స్కఫ్ ఫోల్డింగ్ పైపులు పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ములగాడ: హెచ్‌పిసిఎల్‌లో స్కఫ్ ఫోల్డింగ్ పైపులు పడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. సంఘటన స్థలం నుంచి గుట్టుచప్పుడు కాకుండా ప్రాణం ఉందంటూ కార్మికుని మృతదేహాన్ని సంస్థ గేటు దాటించి ఇఎస్‌ఐ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... 61వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్‌లో నివసముంటున్న వై.సుధాకర్ హెచ్‌పిసిఎల్‌లోని జ్ఞానసాయి ఇంజినీరింగ్ సంస్థ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇంకో అరగంటలో డ్యూటీ ముగుస్తుందన్న సమయంలో స్కఫ్ ఫోల్డింగ్ పైపులు అన్‌డింగ్ చేస్తున్నారు. అదే సమయంలో షెడ్డు నుంచి బయటికు వస్తున్న సుధాకర్ తలకు పైపు బలంగా తగలడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అంబులెన్స్ ద్వారా ఇఎస్‌ఐకి తరలించారు. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు ఇఎస్‌ఐ ఆసుపత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం సుధాకర్ మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

సంస్థ లోపల కార్మికుడు మృతి చెందితే గుట్టుచప్పుడు కాకుండా బయటకు తరలించడం ఏమిటని యూనియన్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పాఠశాల విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందినట్లు పిఎం.పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సిఐ రామకృష్ణ కథనం ప్రకారం... అల్లూరి సీతారాం జిల్లా పాడేరు మండలం లోచలపుట్టు గ్రామానికి చెందిన జరసింగ్ ప్రదీప్ (12) మారికవలస సమీపంలోని ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో ఆరో తరగతి చదువుతున్నారు. ప్రదీక్ 27వ తేదీన అనారోగ్యంగా ఉండడంతో పాఠశాల యాజమాన్యం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. తగ్గకపోవడంతో 28వ తేదీన కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందాడు. విద్యార్థి తండ్రి సుబ్బారావు ఫిర్యాదు మేరకు ఎఎస్‌ఐ గణపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టీబీపై అవగాహన కల్పిస్తున్న మధురవాడ పిహెచ్‌సి వైద్య సిబ్బంది

రైతుబజార్‌లో టీబీపై అవగాహన

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ పిహెచ్‌సి ఆధ్వర్యాన కొమ్మాది రైతుబజార్‌లో రైతులకు, వినియోగదారులకు టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి టీబీ విభాగం సిబ్బంది మాట్లాడుతూ, రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కఫంతో పాటు రక్తం పడటం తదితర లక్షణాలు ఉంటే దగ్గరలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్‌కు వెళ్లి డాక్టర్ సలహాతో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కఫం పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. కఫ పరీక్షల్లో టీబీ నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ మేరకు కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ ప్రసాద్, ఎస్‌టిఎస్ సురేష్, ల్యాబ్ సూపర్‌వైజర్ వీరబ్రహ్మం, సిబ్బంది అనూష, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా యుపి పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం వెంకటాపురంలోని యుపి పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు పిఆర్‌పి.వర్మ అధ్యక్షతన వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు. ఎంఇఒ అమృత బాలామణి మాట్లాడుతూ, 2వ విడత నాడు నేడు నిధులు పాఠశాలకు మంజూరు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలిచ్చిన విద్యార్థులకు విశ్రాంత ఆంధ్రాబాంక్ మేనేజర్ వి.చంద్రమౌళి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, యూత్ నాయకులు ఇల్లాపు వెంకట్ జగన్, విద్యా కమిటీ చైర్మన్ చుక్క గురునాయుడు, ఉపాధ్యాయులు జయభారతి, నిర్మల, అపరంజి, జ్యోతిర్మయి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా 'అవంతి' వార్షికోత్సవం

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అవంతి విద్యాసంస్థల వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సానుకూల దక్పథంతో ఆలోచనలు చేయాలన్నారు. నైతిక విలువలు ఆధారంగానే విద్యార్థి నడత, నడకను అంచనా వేయొచ్చని తెలిపారు. సమయపాలన, క్రమశిక్షణ ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఎంచుకున్న రంగంలో పట్టు సాధించడం ద్వారానే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. భువనేశ్వర్ ఐఐటి, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ రత్నం వరద రాజ్‌కుమార్ మాట్లాడుతూ, సాఫ్ట్‌వేర్ రంగంలో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. నైపుణ్యం పెంచుకోవడం ద్వారా వాటిని అందిపుచ్చుకో వచ్చని తెలిపారు. విజయనగరం జెఎన్‌టియు జివి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఆ రంగంలో ఉపాధి అవకాశాలు వెతుక్కోవాలని సూచించారు. నమయ్ సాఫ్ట్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ కె.శ్రీధర్ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యను అభ్యసించాక, అందుకు అనుగుణంగా, అనువైన ఉద్యోగ అవకాశాలు ఉంటాయని అన్నారు. అవంతి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో , రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

షాట్‌పుట్‌లో దీక్షిత మైటికి రెండోస్థానం


దీక్షిత మైటిని అభినందిస్తున్న డైరెక్టర్ ఎన్‌ఆర్‌కె రెడ్డి


ప్రజాశక్తి -తగరపువలస : ఆంధ్రా వైద్య కళాశాల ఆధ్వర్యాన ఇటీవల జరిగిన డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీల్లో స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలకు చెందిన బిడిఎస్ ప్రథమ ఏడాది విద్యార్థిని వడ్డి దీక్షిత మైటి షాట్‌పుట్‌లో రెండోస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాలలో బుధవారం డైరెక్టర్ ఎన్ఆర్‌కె.రెడ్డి, సిఇఒ, నిరంజన్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, ఎఒ జెవిడి.నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ గున్నాజి అభినందించారు.

ఆనందపురంలో ఇగ్లూ సినిమా థియేటర్ ప్రారంభం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం హైవేలో వెల్లంకి వద్దనున్న గోకార్టింగ్ (కార్ రేస్) ఆవరణలో విదేశాల్లో మాదిరి నిర్మించిన ఇగ్లూ సినిమా థియేటర్‌ను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్యులకు అందుబాటులో వినోదం అందించేందుకు అధునాతన టెక్నాలజీతో మన ప్రాంతంలో థియేటర్ నిర్మించడం అభినందనీయమన్నారు. గోకార్ట్ యజమాని ఆనంద్, థియేటర్ యజమాని శివకృష్ణ మాట్లాడుతూ, ప్రేక్షకులకు మంచి ఎఫెక్ట్‌తో, అతి తక్కువ టికెట్ ధరలతో వినోదం అందించాలన్న ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. హీరో నాని, కీర్తి సురేష్ నటించిన దసరా సినిమా గురువారం నుంచి థియేటర్లో ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాపునాడు విశాఖ జిల్లా అధ్యక్షులు తోట రాజీవ్, భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఎం.మహేష్, ఎంపిపి మజ్జి శారద ప్రియాంక, వైస్ ఎంపిపి పాండ్రంగి శ్రీను, జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, నాయకులు బంక సత్యం, కాకర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జి-20తో సుందరంగా డంపింగ్ యార్డు

ప్రజాశక్తి -మధురవాడ : ఒకప్పుడు దుర్వాసనకు నిలయమైన కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ నేడు సుందరంగా ప్రజలకు దర్శనమిస్తోంది. జి-20 సదస్సు పుణ్యమా అని డంపింగ్ యార్డ్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. ఇక్కడ జిందాల్ సంస్థ చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంటును ఏర్పాటుచేసింది. సదస్సుకు విచ్చేసిన విదేశీ అతిథులు గురువారం దీన్ని సందర్శించనున్నారు. దీంతో రూ.75లక్షలతో ఇక్కడ పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రవేశద్వారంతో పాటు రహదారులను అభివృద్ధి చేశారు. డంపింగ్ యార్డుకు వచ్చే మార్గంలో ఇరువైపులా 12 అడుగుల పెన్సింగ్ వేశారు. గోడలకు రంగులు వేసి ఆకట్టుకునేలా బొమ్మలను గీయించారు. పూలమొక్కలు, పచ్చదనంతో సుందరీకరణ పనులు చేపట్టారు.



సుందరంగా తీర్చిదిద్దిన ప్రవేశద్వారం పరిసరాలు

'ఉక్కు'పై ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ పట్ల ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం దుర్మార్గమని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. స్టీల్ సిఐటియు మిత్రపక్షాల ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ, యాజమాన్య విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు నినదించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలు అంటూ స్థానిక యాజమాన్యం కార్మిక సంఘాలతో చర్చించకుండా ప్లాంట్ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టె నిర్ణయాలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ విషయాన్ని ప్లాంట్‌లోని అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులు వ్యతిరేకిస్తూ న్యూఢిల్లీలో కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారని వివరించారు. ఈ నిర్ణయంపై సమీక్షించి తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్రానికి తలమానికమైన విశాఖ ఉక్కు కర్మాగారం పట్ల కేంద్ర నిర్ణయంపై రాష్ట్రంలోని పార్టీలు ద్వంద వైఖరితో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. జి 20 సదస్సు ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించిన సమయంలో కూడా దీనిపై జరుగుతున్న కుట్రను ముఖ్యమంత్రి ప్రస్తావించలేదని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు చిత్తశుద్ధితో పోరాటానికి సహకరించడం లేదన్నారు. ఈ పరిస్థితికి వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యపరిచి ఉద్యమాలతో ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, మిత్రపక్షాల నాయకులు డివి.రమణారెడ్డి, డి.సురేష్‌బాబు, సిహెచ్ సన్యాసిరావు మాట్లాడుతూ, దేశంలో నెలకొన్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. దేశంలోని మిగిలిన స్టీల్ ప్లాంట్లకు విశాఖ ఉక్కు కర్మాగార స్థాపనలో గల వ్యత్యాసాన్ని గమనించకుండా ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఐక్య కార్యాచరణతో ప్రతిఘటించాలని, ఆ దిశగా అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, యు.వెంకటేశ్వర్లు, గంగాధర్, టివికె.రాజు, కెవి సత్యనారాయణ, డి.కృష్ణమూర్తి, బిఎన్.మధుసూదన్, డిఎస్ఆర్‌సి.మూర్తి, శ్రీనివాసులురెడ్డి, విడివి పూర్ణచంద్రరావు, డిఎస్‌విఎస్ శ్రీనివాస్, శశిరెడ్డి, బి.మహేష్, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, మిత్రపక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

టెక్ ఫెస్ట్‌లో 'కెమికల్' ప్రతిభ

ప్రజాశక్తి -కంచరపాలెం : కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో ఈ నెల 25 26 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్‌లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రతిభను చాటారు. వీరు ఎనిమిది గ్రూపులుగా సృజనాత్మక పరిశోధనలకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు రెండు గ్రూపులు పోస్టర్ ప్రదర్శన విభాగం, ఆరు గ్రూపులు పేపర్ ప్రజెంటేషన్ విభాగాల్లో పాల్గొన్నారు. ఐదు గ్రూపులు బహుమతులు గెలుచుకున్నాయి. బి.ప్రణీత, సిహెచ్.మేఘన, జి.మెర్సీ, ఎల్.మురళీకృష్ణారావుల బృందం ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీకి సంబంధించి పోస్టర్ ప్రదర్శనలో మొదటి బహుమతి, గ్రీన్ కెమికల్స్ విభాగంలో బి.ప్రియాంక, అంజలి కుమారి, పి జాహ్నవి, బృందం పేపర్ ప్రజెంటేషన్లో మొదటి స్థానం, బి.హరిశంకర్, బి.నిత్యప్రకాష్, ఎంవి.నరేష్‌వర్మ బృందం ద్వితీయ బహుమతి, కార్బన్ సీక్వెస్ట్రేసన్ విభాగంలో వై హర్ష, పి లక్ష్మణ్‌చరణ్, కె దుర్గాప్రసాదుల బృందం పేపర్ ప్రజెంటేషన్‌లో ద్వితీయ బహుమతి, సబ్ సి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో జయంతి శ్రావణ శృతి, ఎల్.తేజ సాయి, వి.జ్ఞానేశ్వర్ బృందం పేపర్ ప్రజెంటేషన్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కాలేజీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, హెడ్ బి.లక్ష్మణరావు, సిబ్బంది అభినందించారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైఎస్ఆర్ ఆసరా నిధులు విడుదల చేసిన శుభసందర్భంగా ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన 46వ వార్డు పరిధి కైలాసపురం, శాంతినగర్ సచివాలయం వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం రామాలయం వద్ద నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు ఆసరా లబ్ధిదారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, అక్కచెల్లమ్మల సంక్షేమం, స్వావలంబన, సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. అధికారం చేపట్టిన 14 నెలలు కాలంలో మహిళలకు మేలుచేసే ఎన్నో పథకాలను ముఖ్యమంత్రి తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉష్రశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు నీలి రవి, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజత, ఎపిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ స్కానర్, ప్రింటర్ అందజేత

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు కంప్యూటర్ స్కానర్, ప్రింటర్‌ను గాయత్రి విద్యా పరిషత్, హాస్పిటల్ సంస్థ అందజేసింది. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు కంటి పరీక్షల శిబిరాలను నిర్వహిస్తూ సేవలందిస్తున్న కంటి ఆసుపత్రికి అవసరమైన ఈ పరికరాలను గాయత్రీ విద్యా పరిషత్ హాస్పిటల్ ఆప్తమాలజీ విభాగం ప్రొఫెసర్, హెచ్ఒడిలు డాక్టర్ యుఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఎ.తారకేశ్వరరావు ద్వారా జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, సూపరింటెండెంట్ డాక్టర్ పి.విశ్వమిత్రకు అందించారు. ఈ కార్యక్రమంలో డిబిసిఎస్ ఆప్తాలమిక్ అధికారులు ఎం.ఉమా శ్రీనివాస్, ఆర్.సురేష్ పాల్గొన్నారు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 420 మంది విద్యార్థులకు తాళ్లవలస పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బి.శోభారాణి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. చిప్పాడ దివీస్ సంస్థ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సిఎస్ఆర్ అధికారి నాగరాజు, నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు, సర్పంచ్ వి.రమావతి, ఎంపిటిసి సభ్యులు సిహెచ్.ఈశ్వరమ్మ, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న కల్యాణోత్సవానికి ముత్యాల తలంబ్రాలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న వార్షిక కల్యాణోత్సవానికి ఒక కిలో ముత్యాల తలంబ్రాలను గోపాలపట్నం స్వర్ణ జ్యువెలర్స్ అధినేత బుధవారం దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు అందజేశారు.

అప్పన్న పట్టు వస్త్రాలకు విరాళాలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న వార్షిక కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాల నిమిత్తం పలువురు దాతలు విరాళాలను అందజేశారు. చెన్నైకి చెందిన వెంకటరమణ రూ.1.70 లక్షలు, దాచారం అప్పారావు రూ.1.40 లక్షలు, లీప్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధి ఎస్‌కె.మూర్తి రూ.1.40 లక్షలను బుధవారం దేవస్థానం ఈఓ వి.త్రినాథరావు, ప్రధాన అర్చకులు గోడవర్తి శ్రీనివాస్ ఆచార్యులకు అందజేశారు.

ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జోన్ కార్యదర్శి రమణి

ప్రజాశక్తి-పెందుర్తి : రానున్న రోజుల్లో ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి పిలుపునిచ్చారు. జివిఎంసి 96వ వార్డులోని సిఐటియు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన కోరాడ రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. గెలుపోటములు సహజమన్నారు. మన కష్టం ఎప్పటికీ వృథా కాదన్నారు. ప్రధాన పార్టీలతో మనం కూడా ఒకరిగా పోటీలో ఉండడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్, సిఐటియు నాయకులు ఎస్.శంకరరావు, జి.శంకరరావు, సూర్యప్రకాష్, అప్పారావు, ఐద్వా నాయకులు రజిని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

54వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి- కంచరపాలెం : జివిఎంసి 54వార్డు పరిధి సిద్ధార్థనగర్ సంకురుపేట ప్రాంతంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె రాజు, వార్డు కార్పొరేటర్ చల్లా రజినిఈశ్వరరావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, అందరికీ సంక్షేమ పథకాలు అందాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళ శ్రీనివాస్, నూకరాజు, రమేష్, ఎం.సునీల్, కణితి చిరంజీవి, కె.రవణమ్మ, దిలీప్, జగదీష్, శ్రీను, నీలరావు, ప్రకాష్, శంకర్, రాంబాబు, పి.శివ, వెల్లశ్రీను, నూకరత్నం, సూరిబాబు, రమేష్, షేక్ బాజ్జి, కె చిన్న, హరి పట్నాయక్, రాఘవులు, కర్రీ రామారెడ్డి, నేపాల్ శ్రీను, సూర్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవకు స్వచ్ఛంద సంస్థలు ముందుండాలి

ప్రజాశక్తి -గాజువాక : పేదల అవసరాన్ని గుర్తించి సాయం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు పిలుపునిచ్చారు. వార్డులోని గిరిజాకాలనీ సామాజిక భవనం వద్ద బుధవారం సీఎల్సీ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, సామాజిక సేవే ధ్యేయంగా ఈ సంస్థ చేపడుతున్న సేవలు చాలా విలువైనవని కొనియాడారు. మురికివాడల్లో ప్రజల ఇబ్బందులను తెలుసుకొని తాగు నీటి బోర్లు, మహిళాభ్యున్నతికి కుట్టు మిషన్లను పంపిణీ చేస్తుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. బిషప్ మహంతి, ఆల్ఫ్రెడ్ మహంతిల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కెఎస్ విఎఎస్ రాజు, డాక్టర్ నితీశ్ వర్మ, డాక్టర్ దేవి వేగేశ్న, డాక్టర్ కె.రవితేజ, డాక్టర్ మహేష్, డాక్టర్ టిఎస్.నాయుడు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో పెద్దింటి మంగునాయుడు, సింగంపల్లి దేముడు, వాడపల్లి ప్రవీణ్, జానా సతీష్, పెంద్ర రాజు, ఆర్మీ సతీష్, పరశురాం, నారాయణ మూర్తి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'తూర్పు కాపులకు ప్రాధాన్యత ఇవ్వాలి'

ప్రజాశక్తి -కంచరపాలెం : తూర్పు కాపు కులానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆల్ ఇండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ కోరారు. విశాఖలోని తూర్పు కాపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, భవిష్యత్తులో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు కాపు కులానికి తగిన రాజకీయ ప్రాధాన్యత ఇవ్వకపోతే అన్ని నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ కద్దాల శ్యాంసుందర్ రావు, జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లి శ్రీనివాసులు నాయుడు, జాతీయ నాయకులు కొండపల్లి తేజ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరిమజ్జి మల్లేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దాసరి శివశంకరరావు పాల్గొన్నారు.

31న జాబ్ మేళా

ప్రజాశక్తి- కంచరపాలెం : విశాఖపట్నం జిల్లాలోని ప్రముఖ సంస్థలలో టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టుల భర్తీ కోసం కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 31న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి, కె సుధ ఒక ప్రకటనలో తెలిపారు. అలివిర యానిమల్ హెల్ప్ లిమిటెడ్, మెడ్‌ప్లస్ ఫార్మసీ, మాస్ పవర్ రిక్రూర్మెంట్, బిజెడి 2050 హెల్త్ కేర్ లిమిటెడ్, ఎటిసి టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలలో ఖాళీల భర్తీకి ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లమో, జిడిఎ ఎంపిహెచ్‌డబ్లు, ఎఎన్ఎం, జిఎన్ఎమ్, బీఎస్సీ నర్సింగ్ అర్హతలు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉద్యోగ విభాగానుసారం 18 నుంచి 40 సంవత్సరాలు మధ్య గలవారు హాజరు కావచ్చని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా ncs.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకొని, ఆ రోజు జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

వినసొంపుగా సినీ గీత మాలిక

ప్రజాశక్తి-సీతమ్మధార : రాగమాలిక సాంస్కృతిక సేవా సంస్థ 152వ మాసపు సినీ గీత మాలిక ప్రదర్శన బుధవారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. విజయ నిర్మాణ్ గ్రూప్స్ అధినేత డాక్టర్ సూరపనేని విజయ్ కుమార్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు సన్ మూర్తి, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, కళా సంస్థల ప్రతినిధులు, ఎస్.ఫణిస్వామి, వెంకటేష్ మాస్టర్, మల్లికా చౌదరి, మస్తాన్ రెడ్డి, భరద్వాజ్, కేవీ సత్యనారాయణ, మహ్మద్ ఖాన్, నాగరాజు, బొమ్మిడి సత్యనారాయణ, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సంగీత విభావరి ఆద్యంతం అలరించిందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

రెండో రోజూ అప్పన్న హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు రెండో రోజు కూడా కొనసాగింది. మొదటి రోజు లెక్కింపులో నగదు రూ.2,06,11, 210 రాగా రెండో రోజు రూ.74,01,967 ఆదాయం లభించింది. బంగారం రెండు రోజులకు కలిపి 156 గ్రాముల 600 గ్రాములు, వెండి 18 కిలోల 91 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు జగ్గునాయుడు

ప్రజాశక్తి - ములగాడ

ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. బుధవారం హెచ్‌పిసిఎల్ లేబర్ గేట్ వద్ద సిఐటియు మల్కాపురంజోన్ కమిటీ ఆధ్వర్యాన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, మోడీ విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5వ తేదీన కార్మిక, కర్షక సంఘర్ష ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. నేడు మోడీ నియంతపాలన చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. అంబానీ అదానీలకు కొమ్ము కాస్తూ దేశసంపదను అమ్మకానికి పెడుతున్నారని మండి పడ్డారు. మోడీపాలనలో గిట్టుబాటు ధర లేక రైతులకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, నిరుద్యోగం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటీకరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, ఏప్రిల్ 5వ తేదీన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రదర్శన, మార్చి 31న సింధియా నుంచి జింక్ గేట్ వరకు బైక్ ర్యాలీ, ఏప్రిల్ 4వరకు వార్డుల్లో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్షులు కె.పెంటారావు, జి.నరేష్, ఎస్.వాసు, మహేంద్ర, బి.శ్రును ప్రేమ్, విష్ణు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యాన ఆనందపురం కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఆనందపురం పూల మార్కెట్, బంటుపల్లి వారి కల్లాలు రోడ్డు, వేముల మెయిన్ రోడ్డు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి రవ్వ నర్సింగరావు మాట్లాడుతూ, కార్మిక, కర్షక, ఉద్యోగ, రైతులు, సామాన్య ప్రజలందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శరత్‌చంద్ర, శివశంకర్ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : 94వ వార్డులో జరిగిన సమావేశంలో చలో ఢిల్లీ కార్యక్రమంపై జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడారు. వార్డు నాయకురాలు సోములమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది.

చోడవరం : ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రుత్తల శంకర్రావు పిలుపునిచ్చారు. స్థానిక మెయిన్ స్కూల్లో వివిధ రంగాల కార్మికులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కీమ్‌వర్కర్లకు కనీస వేతనం అమలు చేయలేదని, పిఎఫ్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌వి. నాయుడు, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి ,రామలక్ష్మి పాల్గొన్నారు.

దేవరాపల్లి : గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, కౌలు రైతులకు సమగ్రమైన చట్టం చేయాలని డిమాండ్లతో ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపి వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న పిలుపునిచ్చారు. బుధవారం ఉపాధి కూలీలు పనులు చేస్తున్న ప్రాంతంలో చలో ఢిల్లీ కరపత్రాలతో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు అనకాపల్లి నేత శంకరరావు


మాట్లాడుతున్న సిఐటియు నేత సిహెచ్.నర్సింగరావు

విశాఖ కలెక్టరేట్ : రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్ వద్ద కార్మికులనుద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, నాయకులు అప్పలరాజు మాట్లాడారు. చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలతో ముందుకు సాగుతోందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను ఇష్టానుసారం పెంచేయడంతో సామాన్యులు బతకడం కష్టంగా ఉందన్నారు. పన్నుల భారం విపరీతమైందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైల్వే ఆటో స్టాండ్ నాయకులు నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

కశింకోట : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీలో సందర్భంగా జరుగుతున్న కార్మిక కర్షిక ప్రదర్శనలో పాల్గొనాలని సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని బయ్యవరంలో ఆటో వర్కర్లకు చలో ఢిల్లీపై కరపత్రాల పంపిణీ చేశారు.


ఉపాధి కూలీలతో కలిసి నినాదాలు చేస్తున్న వెంకన్న


మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌ఛార్జి నాయుడుబాబు

వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి-కశింకోట : రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించాలని నరిశింగబిల్లి సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి గండి నాయుడుబాబు అన్నారు. నరిశింగబిల్లి సహకార బ్యాంకు మహాజనసభ బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంఘాల అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు, పాతబకాయలు వసూలుకు మహాజనసభ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ నాయుడు, డైరెక్టర్ బుదిరెడ్డి బాబు రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, మజ్జి ప్రసాదరావు, కొప్పాక రామగణేష్, కొన వెంకట సత్యనారాయణ, బ్యాంకు కార్యదర్శి నక్కా అచ్చియ్యనాయుడు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పరవాడ : పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికొదిలేశారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ విమర్శించారు. పరవాడలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో గనిశెట్టి మాట్లాడుతూ తాడి గ్రామాన్ని 15 రోజుల్లో తరలిస్తామని ముఖ్యమంత్రి వాగ్దానం చేసి నేటికీ సంవత్సరాలు గడుస్తున్నా కనీసం ఈ సమస్యను ప్రస్తావించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పరిశ్రమల్లో 75 శాతం ఉపాధి స్థానికులకు కల్పిస్తానని వాగ్దానం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధిక లోడు బొగ్గుతో వాహనాలు నడుస్తున్న వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. యాజమాన్యాలతో ఎమ్మెల్యే కుమ్మక్కవడంతో స్థానిక నిర్వాసితులకు ఉపాధి లేకుండా పోయిందని తెలిపారు. కాలుష్యంతో మండల ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు లారీలను అదుపు చేయాలని, అధిక లోడు వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే స్థానికులతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సహకారంతో అడపా రమణమ్మ అనే వృద్ధురాలికి వీల్‌చైర్‌ను విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యాన బుధవారం అందజేశారు. వికలాంగులకు రూ.5000 పింఛన్, పక్క గహాలు, రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని, వివాహక ప్రోత్సాహకాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు

వైసిపి పాలనలో పంచాయతీ వ్యవస్థ అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి పాలనలో పంచాయితీ వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందిందని రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షులు, ఏపీ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు మేకల హనుమంత్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబును, మూడు జిల్లాల పంచాయతీల రీజనల్ కోఆర్డినేటర్, ఎలమంచిలి ఎంపీపీ బొద్దపు గోవిందను సత్కరించారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా పంచాయతీలు ఎంతో పురోభివృద్ధి సాధించాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ఎంపీపీలు పాల్గొన్నారు.


ఎంపిపిలు సూరిబాబు, గోవిందను సన్మానిస్తున్న హనుమంత్


మందుల గదిని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ హేమంత్

పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి-చోడవరం : అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హేమంత్ బుధవారం గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను మందులను, రికార్డులను పరిశీలించిన తర్వాత రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అమలు వాటి వివరాలను వైద్యం వృందానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఏప్రిల్ 3 తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగు 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి సిహెచ్. రవీంద్రబాబు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులు సుమారుగా 420 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 220 మంది, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 200 పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. అన్ని రూముల్లో బెంచీలు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం కల్పించామని, పరీక్షా కేంద్రాల ఆవరణంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. దూర ప్రాంతాల వారికి ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులు బస్సు సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

దోషులను అరెస్టు చేయాలని కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దేవరాపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రం దేవరాపల్లికి చెందిన జామి సింహచలంనాయుడు మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం రాత్రి దేవరాపల్లి పురవీధుల్లో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సింహాచలం నాయుడుకు జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. సింహాచలంనాయుడు మృతికి కారకులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సింహాచలంనాయుడు మృతి చెందిన 11 రోజులైనా ఇప్పటికీ ఎటువంటి విచారణ జరపకపోవడంపై దారుణమన్నారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు జరపకుండా టెక్నికల్ సమస్యలు సాకుగా చూపించి మరింతగా అనుమానాలు రేకెత్తించే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కేసు నుండి దోషులను తప్పించడం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సింహచలంనాయుడు మృతికి కారణమైన వారిపై వెంటనే చర్యలు చేపట్టకపోతే జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని వారు స్పష్టం చేశారు.

క్రికెట్ బెట్టింగులపై పోలీసులు నిఘా పెట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : త్వరలో జరగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంలో బెట్టింగ్ మాఫియా చెలరేగకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ధ రాజేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత రెండేళ్లుగా అనకాపల్లి ప్రాంతంలో 20 నుంచి 40 సంవత్సరాల వయసులో ఉన్నవారు బెట్టింగుల ఊబిలో పడి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్న వారు ఎందరో ఉన్నారన్నారని తెలిపారు. తల్లిదండ్రులు బెట్టింగ్ మాఫియాకు భయపడి ఫిర్యాదు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో బెట్టింగ్ మాఫియాపై నిఘా పెట్టి బెట్టింగ్లు జరగకుండా చూడాలన్నారు. పట్టణంలోని పలు లాడ్జిల్లో బెట్టింగ్లు జరుగుతున్నాయని వీటిపై కూడా నిఘా పెట్టాలని కోరారు.


మాట్లాడుతున్న బుద్ధ రాజేష్



రోడ్డు నిర్మాణ పనుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

బిఎన్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-వడ్డాది : విజయరామరాజుపేట నుండి కోమల్లపూడి వరకు భీమునిపట్నం-నర్సీపట్నం (బిఎన్) రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఎంఎల్‌ఎ కరణం ధర్మశ్రీ ఆదేశించారు. బుచ్చయ్యపేట మండలం విజయరామ రాజు పేట వద్ద రోడ్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటలాడుతూ రోడ్డుపై ఉన్న గోతులను వెంటనే కప్పి రోడ్డు పనులు వేగవంతం చేయాలన్నారు. అలసత్వం వహిస్తే కాంట్రాక్టర్‌పై తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి దొండా లలిత నారాయణమూర్తి, వైసిపి నాయకులు కోవెల జనార్దన్‌రావు, దొండా అచ్చయ్యదొర, గుమ్మడి ప్రసాద్, వెలుగుల అయ్యన్న దొర, సుంకర నాగేష్, కాంట్రాక్టర్లు, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల ఆవరణలో జరిగిన వీడ్కోలు సభలో డైరెక్టర్ బత్తుల నోబెల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువు తోపాటు ఆటలు పాటల్లో రాణించాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బత్తుల అనురాధ, శైలజా, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ గౌతమ్ శాలిని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. వారాంతపు సెలవులు తీసుకుంటున్నది, లేనిది ఎస్సై నాగేంద్రను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్వాధీనపరచుకున్న సొత్తును భద్రపరిచే గదిని పరిశీలించారు. ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా పరిశీలన చేసి ఆ కేసుల ఫైళ్లను క్లోజ్ చేయాలని ఆదేశించారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం హైస్కూల్‌లో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహారం మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుచిత్ర ఆదిలక్ష్మి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పప్పు, ఆకుకూరలు, వివిధ రకాల వంటకాలు ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, అద్దంకి సతీష్, చిన్ని వల్లభ నారాయణరావు, జనసేన నాయకులు కర్రి లోవరాజు, కర్రి గోవింద, పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి సుమన్, అంగన్వాడీ కార్యకర్త ధనలక్ష్మి పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని యడ్లవానిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామాంజనేయ ఆలయానికి పాత్రికేయుడు వేగి రామారావు బుధవారం పదివేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కె. కోటపాడు శ్రీషిరిడి సాయి ఆలయ కమిటీ తరఫున పదివేల రూపాయలు విరాళంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యడ్ల రమణమ్మ, సిసి నాయుడు, మహిళలు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న పాత్రికేయుడు రామారావు

ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం

స్థానిక శివాలయం వద్ద చోడవరం మండలంలోని డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులను ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చిన జగన్ మోహన్ రెడ్డిని మరొక మారు ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాడి కాసు, ఎంపిడివో ఎస్వి.శ్యామ సుందర్, స్థానిక సర్పంచ్ నూకాలమ్మ, వైస్ ఎంపిపీలు బుద్ద గంగరాజు, బైన ఈశ్వరరావు, వైసిపి నాయకులు బొడ్డేటి సూర్యనారాయణ, వెంపలి ఆనందేశ్వరరావు, దొడ్డి హనుమంతరావు, ఒరుగంటి నెహ్రూ, బొడ్డు శ్రీరామ్మూర్తి, అల్లాడ భవాని తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ సంతబయలు వద్ద వైఎస్ఆర్ ఆసరా పథకం చెక్కులను డ్వాక్రా మహిళలకు పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెందుర్తి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

నియోజకవర్గంలో 5319 ఎస్‌హెచ్‌జిఎస్‌లో ఉన్న 45,324 మంది పేద మహిళలకు 3వ విడతగా 53.08 కోట్ల రూపాయలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపిపీలు బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు, వైసిపి నాయకులు చుక్క రామునాయుడు, కోన రామారావు, ఎంపిడిఓ హేమ సుందరరావు, ఎపిఎమ్ కనకమ్మ, పలువురు సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి



కళాసీలు, కొలగార్లకు యూనిఫారం పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి

వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయనున్నట్టు చైర్ పర్సన్ పలక యశోద రవి తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిపాలన భవనంలో బుధవారం ఆమె అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఎంసి అభివృద్ధికి పలు తీర్మానాలు చేశారు. ప్రధానంగా సోలార్ రూఫ్ ప్యానల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసి మార్కెటింగ్ కమిటీ కమిషనర్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులకు పంపనున్నట్లు తెలిపారు. అనంతరం కొలగార్లు, కలాశీలకు రెండు జతల చొప్పున యూనిఫారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రి గ్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి రవి కిరణ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, ఉపాధ్యక్షులు కరక సోమ నాయుడు, సభ్యులు నీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల ఈగల నూకరత్నం, దాడి తులసి, బొద్దు అచ్చిరాజు, ఒమ్మి మధు, దాడి కుమార్, గుండా రమేష్ గుప్తా, మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్న కొండ రోడ్డుకు నిధుల మంజూరుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : బొజ్జన్న కొండ రోడ్డుకు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ సత్యవతి, మంత్రి గుడివాడ అమర్నాథ్, కలెక్టర్ రవి పటాన్ శెట్టి కోటి 50 లక్షలు రూపాయలు మంజూరు చేయడం పట్ల సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన బొజ్జన్న కొండ వద్ద ప్లకార్డులతో బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణం రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇరువైపులా వాకింగ్ ట్రాక్, పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

టిబి రోగులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం టిబి రోగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కశింకోట ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సలిమియా, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, ముక్కామల వెంకట్రావు, వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.

2న నవోదయ మోడల్ గ్రాండ్ టెస్టు

ప్రజాశక్తి-చోడవరం : ఏప్రిల్ 2న నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్ చోడవరంలో వివేకానంద కాలేజీలో నిర్వహిస్తున్నామని రాజు ఎడ్యుకేషన్ నిర్వాహకులు బూరా జగదీశ్వరి, బూరా అప్పలరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో వెంకన్నపాలెం కేంద్రంగా తమ విద్యా సంస్థ నడుపుతున్నామని, నవోదయ ఎంట్రెన్స్ ఎగ్జామ్ విద్యార్థులను ప్రోత్సహించడానికి ఈ పరీక్షను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్నవారు 8500639947 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

'గ్రామ పటం'పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- వడ్డాది : గ్రామ పటంపై ప్రజలందరికీ అవగాహన ఉండాలని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు తెలిపారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుచ్చయ్యపేట మండలం కోమలపూడిలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉండే నివాస పద్ధతి, సాంఘిక సమాచారం, మౌలిక వసతులు, వనరులు, ప్రభుత్వ కార్యాలయాలు, నీటి సౌకర్యాలు, వాటి విశిష్టత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.రాజ కుమార్, విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్, సర్పంచ్ గేదెల వెంకి అమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- వడ్డాది : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 6, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని వడ్డాది కెజిబివి ప్రత్యేక అధికారి కోసూరి అన్నపూర్ణ అన్నారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో 6, 11 తరగతుల్లో చేరడానికి ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, బడి మానేసిన వారు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బిపిఎల్ తరగతుల బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల నోటీసు బోర్డులో నేరుగా చూడవచ్చని చెప్పారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి

స్వచ్ఛ ఉత్సవ్ ర్యాలీ

ప్రజాశక్తి - యలమంచిలి : స్వచ్ఛఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కౌన్సిలర్లు, విద్యార్థులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధం, తడి పొడి చెత్త వేరుచేయడం, హెూమ్ కంపోస్టు తదితర అంశాలపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుండి బస్టాండ్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు సాగించి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, మెప్మా పద్మావతి, శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

104 వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో 104 సంచార వైద్య వాహనాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఇంటింటికి మెరుగైన వైద్య సేవలందించడానికి ఫామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. గ్రామాల్లో రోగుల కోసం సంచార వైద్య ఆరోగ్య వాహనాల ద్వారా హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గుల్లేపల్లి, సబ్బవరం పిహెచ్‌సిల పరిధిలోని 24 పంచాయితీల్లోని 16 గ్రామ సచివాలయాల్లో నెలకు రెండు సార్లు ఈ 104 సంచార వైద్య ఆరోగ్య వాహనాలు ద్వారా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, వైసిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షులు కోటన రాము, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాల నాయుడు, పిఏసిఎస్ వైస్ చైర్మన్ పల్లా కృష్ణ, సబ్బవరం-3 ఎంపిటీసీ బైలపూడి దేముడు బాబు, ఉపసర్పంచ్ ఎం లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, పెచ్చెట్టి రమేష్ నాయుడు, దెడ్డము పద్మావతి, ఎర్రంశెట్టి రాము పాల్గొన్నారు.

రజకుల సామాజిక భవనానికి రూ.70 లక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవిఎంసీ 80వ వార్డు రజక కాలనీలో అన్ని వసతులతో సామాజిక భవనాన్ని నిర్మించేందుకు రూ.70 లక్షలు ఎంపీ లాడ్స్ విడుదల చేసినట్లు ఎంపీ డాక్టర్ సత్యవతి తెలిపారు. ఈ మేరకు బుధవారం కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ రావు తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు, స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఎంపీ సత్యవతికి కార్పొరేటర్ నీలిమ భాస్కరరావు, స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలోని శ్మశానవాటికలో అభివృద్ధి పనులను సర్పంచ్ భీమిశెట్టి మంగ లక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జడ్పిటిసి స్వామి సత్యనారాయణ నిధుల నుండి రూ.ఐదు లక్షలు, స్థానిక ఎంపిటీసీ శరగడం అప్పల నరసమ్మ నిధుల నుండి రూ.రెండున్నర లక్షలతో స్మశాన వాటిక అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్, వైసీపీ నాయకులు భీమిశెట్టి కృష్ణారావు, ఆడారి గణేష్, శరగడం గౌరీశ్వరరావు, కాండ్రేగుల జగన్ మోహన్ రావు, శరగడం సత్తిబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ కర్రి కృష్ణ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి

పలుచోట్ల టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావదినోత్సవాన్ని విశాఖ, అనకాపల్లిల వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సింహాచలంలో జెండా ఆవిష్కరణ

కంచరపాలెం : జివిఎంసి 57వ వార్డు ఆశినానిపాలెంలో ఎన్‌టిఆర్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. అనంతరం పార్టీ సీనియర్ మహిళా నాయకులు పబ్బిశెట్టి రామాయమ్మ, గుండాల భగవతమ్మ, నట్టి జగ్గయమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లాడ శ్రీను, నర్సింగరావు, రేణుక, సోము, మదన్, సంతు, గుత్తుల శ్రీను, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

మాధవధార : 51వ వార్డు కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ కీర్తిశేషులు ససపల సీతారామాంజనేయులు కుమారుడు ససపల కీర్తి కేకు కట్ చేసి పార్టీ కార్యకర్తలకు అభిమానులకు పంచిపెట్టారు. తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో దవల కుమారి, మూల అప్పారావు, పేడాడ మధుసూదనరావు, బొడ్డేపల్లి లలిత, పేడాడ లలిత జాన్ పాల్గొన్నారు.

50వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షులు ససపల వరప్రసాద్ జెండాను ఎగురవేశారు. అనంతరం కేకు కట్ చేశారు. పలువురు కార్యకర్తలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, ఎండ ధాత్రి, ససపల రామచంద్రరావు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేశారు. పలువురు నాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిళ్లా నర్సింగరావు, నాగోతి సూర్యప్రకాష్, పోతిన సోమసుపాత్రుడు, కానూరి అచ్యుతరావు, పోతిన నాయుడు, పిళ్లా కృష్ణ, మామిడి దుర్గారావు, నాగోతి అప్పలరాజు, పిన గోవిందరావు, నాగోతి అచ్చారావు, బండయ్య పాల్గొన్నారు.

సీతమ్మధార: 26వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద కార్పొరేటర్ ముక్కా శ్రావణి ఆధ్వర్యాన ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముక్కా ముత్యాల నాయుడు, ముక్కా కిషోర్ కుమార్, పి.లక్ష్మణ పాల్గొన్నారు.

ములగాడ: 41వ వార్డు పరిధి ప్రకాష్ నగర్ ఏడుగుళ్ల వద్ద ఎన్‌టిఆర్ చిత్రపటానికి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్య సింహ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. కేక్ కట్ చేశారు. సీనియర్ కార్యకర్తలను మౌర్య సింహ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మజ్జి సోమేష్, పెంటకోట హరికుమార్, నీలాపు జోగి, నక్క లక్ష్మణరావు, జయశంకర్, రాజమణి, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, కోరిబిల్లి రాము, ఉరుకోటి డేవిడ్, చైతన్య కుమార్, కామరాజు, దుర్గారావు పాల్గొన్నారు.

సింహాచలం: 98వ వార్డులో మార్కెట్ ప్రధాన కూడలి వద్ద వార్డు అధ్యక్షులు పంచదార శ్రీనివాసరావు పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సతివాడ శంకరరావు, కృష్ణారావు, వెంకటరమణ, బుర్ల కనకరాజు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవ పరిధిలోని పలు వార్డుల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి సన్యాసిరావు, కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్, గాడు అప్పలనాయుడు, గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, బండారు వంశీ, గోవిందు, ఏడువాక సన్యాసిరావు, ముగడ రాజారావు, మూది అప్పారావు, మీసాల సత్తిబాబు, కృష్ణంరాజు, నమ్మి గణేష్, బసవ దేవుళ్ళు పాల్గొన్నారు.



కోటవురట్లలో..

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ మంత్రి ఆర్‌ఎస్‌డిపి అప్పలనర్సింహరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె.రమణ, కె.దామోదరరావు, ఎన్.నందేశ్వరరావు, కె.లీలావతి, కె.లక్ష్మి, ఇ.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్(విశాఖ) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మహానటుడు ఎన్‌టి రామారావు చిరస్మరణీయులని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చోడే పట్టాభి, జిల్లా అధ్యక్షుడు వలిశెట్టి తాతాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

మాడుగుల:పార్టీ ఆవిర్భావం నుండి సేవలు అందిస్తున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలకు ఆ పార్టీ శ్రేణులు బుధవారం మాడుగుల పార్టీ కార్యాలయంలో సన్మానం చేశారు. పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.సీనియర్ నేతలు వేగి రాంబాబు, తుడుము నూకరాజు, మైనర్ శ్రీను, నేమాల మహాలక్ష్మిలకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పుప్పాల అప్పలరాజు, మండల పార్టీ కార్యదర్శి ఉండూరు దేవుడు, గొల్లవిల్లి శ్రీరామమూర్తి, పుప్పాల రమేష్, బుద్దాల రమణ పాల్గొన్నారు.

గొలుగొండ:తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గొలుగొండ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు ఆవిష్కరించారు. నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కొత్తమల్లంపేట మాజీ సర్పంచ్ చిటికెల సాంబమూర్తి, చోద్యం సహకార సంఘం మాజీ అధ్యక్షులు కొండలరావు, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపికృష్ణ, జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల సీతారామమూర్తి, పాత మల్లంపేట సూపర్ సర్పంచ్ గడ్డం ఆనంద్ పాల్గొన్నారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో బుధవారం టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ మండల నాయకులు జానకి శ్రీను ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పి సూర్యారావు, కొడవటిపూడి ఎంపిటిసి సూర్యప్రకాష్, టిడిపి పట్టణ అధ్యక్షులు కసిరెడ్డి ఏసుబాబు, జానకి హరి, తంగేటి శ్రీనివాసరావు, సుంకర బాబ్జి పాల్గొన్నారు.

టిడిపి ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే వేచలపు శ్రీరామమూర్తి ఇంటి వద్ద శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామమూర్తి, బికెపల్లి సర్పంచ్ లింగన్ననాయుడు, మాజీ సర్పంచ్ చిటికెల సత్యనారాయణ, మండలం తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు పాల్గొన్నారు.

అనకాపల్లి:తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహానేత ఎన్‌టి రామారావు అని టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ కెటివిఎ నారాయణరావు అన్నారు. స్థానిక రింగ్ రోడ్‌లోని టిడిపి కార్యాలయం వద్ద టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా 12 మంది సీనియర్ కార్యకర్తలను సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు మాదంశెట్టి నీలబాబు, సబ్బవరపు గణేష్, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యలమంచిలి : స్థానిక మెయిన్ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. టిడిపి నాయకులు గొర్లె శివనారాయణ, రమణబాబు, కొఠారు సాంబ, ఆర్ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక మెయిన్ రోడ్డులోని నందమూరి తారకరామారావు- బసవ తారకం విగ్రహాలకు టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒమ్మి కోటేశ్వరరావు, రాజును సన్మానించారు. నాయకులు మురళి, రమణమూర్తి, శ్రీనివాసరావు, పాల్గొన్నారు

పరవాడ : పరవాడ సంతబయలు వద్ద ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి మాజీ మంత్రి బండారు సత్యన్నారాయణ మూర్తి పూలమాల వేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. టిడిపి నాయకులు వియ్యపు చిన్నా, పైలా జగన్నాధరావు పాల్గొన్నారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ లంకెలపాలెం జంక్షన్‌లో పతాక ఆవిష్కరణ చేశారు.

మునగపాక రూరల్ : మునగపాక మెయిన్ రోడ్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. నలుగురు పార్టీ సీనియర్ నాయకులను సత్కరించారు. నాయకులు ముసలి నాయుడు, ఆడారి మంజు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ఎన్టీఆర్ జంక్షన్‌లో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి కేక్‌ను కట్ చేశారు. ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి రవి కుమార్, ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కింతాడ పంచాయతీ శివారు కూండ్రపువానిపాలెం గ్రామంలో పార్టీ జెండాను నాయకులు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కన్నూరు సూర్యనారాయణ, కశిరెడ్డి అప్పలనాయుడు, బత్తి వెంకటరమణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకులు ఎల్లేటి కరుణాకర రావు నివాసం వద్ద పార్టీ జెండా ఎగరవేసి సంబరాలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. పార్టీ నాయకులు రామ్ పూరి, ఆదిరెడ్డి అక్కునాతాతను సన్మానించారు.

బుచ్చయ్యపేట : దిబ్బిడి, రాజాం గ్రామాలలో తెలుగుదేశం పార్టీ జెండాలను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు గోకవాడ కోటేశ్వరరావు అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.




ఉప్పవరంలో...

అచ్యుతాపురం : టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉప్పవరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆ పార్టీ మండల నాయకుడు కూనిశెట్టి సత్తిబాబు పూలమాల వేసి నివాళు లర్పించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ రాజానపాలెం గ్రామంలో పార్టీ జండా ఎగరవేశారు. పూడిమడక, మోసయ్యపేటలోనూ కార్యక్రమాలు జరిగాయి.

బాధితులకు బీమా అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కలిగి ఉండి మరణించిన ఖాతాదారుల నామినీలకు లబ్ధి చేకూరినట్లు గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ వై.వెంకటేష్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. తమ బ్రాంచ్‌లో పాతకృష్ణదేవిపేటకు చెందిన కసింకోట రమణ, ఏఎల్ పురం గ్రామానికి చెందిన బొడ్డపు సత్తిబాబు బ్యాంకు ఖాతా కలిగి ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా రూ. 2 లక్షల నగదు నామిని పేరు మీద ఖాతాలు వేసి తదితరులకు పాసు పుస్తకాన్ని అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇద్దరు వ్యక్తులు ఇటీవల మరణించడంతో ఆ ఖాతాలకు ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన కలిగి ఉన్న కారణంగా రూ రెండు లక్షల చొప్పున లబ్ధి చేకూరినట్లు తెలిపారు. మరణించిన ఖాతాదారుల నామినీలకు కొత్త ఖాతాలు ప్రారంభించి అందులో భీమా సొమ్మును డిపాజిట్ చేసి అందజేసినట్లు బ్రాంచ్ మేనేజర్ వై.వెంకటేష్ తెలిపారు.



బీమా అంద జేస్తున్న మేనేజర్

గొలుగొండలో భారీ వర్షం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం భారీగా వర్షం కురుస్తుంది. పలు గ్రామాల్లో డ్రైనేజీ లేక రోడ్లపై నీరు నిలిచిపోయి చెరువులను తలపించింది. ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డుపై గోతుల్లో వర్షపు నీరు అంతా నిలిచి పోవడంతో వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షంతో జీడి మామిడి తోటలకు నష్టం చేకూరుతుందని పలువురు రైతులు ఆవేదన చెందారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఏప్రిల్ 1 నుండి రోజుకు 12 వేల మందికి ఉపాధి హామీ పని కల్పించడానికి లక్ష్యం పెట్టుకోవాలని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2023- 24 ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో 33 పంచాయతీల్లో లేబర్ బడ్జెట్ అనుసరించి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా కూలీలకు పని దినాలు కల్పించే విధంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆయా గ్రామ పంచాయతీలో గుర్తించిన పనులను పక్కాగా చేపట్టాలన్నారు. సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు, ఈసి, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

హెటిరో సాయంతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినతీనార్లలో హెటిరో కంపెనీ యాజమాన్యం ఆర్థిక సాయంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు కంపెనీ ప్రతినిధులు ఎం.సుబ్బారెడ్డి, ఎస్.కుల్లాయి రెడ్డి తెలిపారు. బుధవారం నిర్మాణం చేపట్టిన రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చినతీనార్ల గ్రామం నుండి జగనన్న లేఅవుట్, లే అవుట్ నుండి గుర్రాజుపేట రోడ్డును రూ. 13 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను తమ దృష్టికి తీసుకు రావడంతో కంపెనీ యాజమాన్యం స్పందించి, రోడ్డు నిర్మాణానికి ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముసలయ్య, గ్రామ పెద్దలు, కంపెనీ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ప్రతినిధులు

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఇంటర్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిసాయి. నక్కపల్లిలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక రెసిడెన్షియల్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసారు. ఈనెల 15న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు 29తో ముగిసాయి. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి నెలకొంది.



విద్యార్థుల కోలాహలం

సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సీతారామరాజు, పిఒపిఆర్డి వెంకట నారాయణ సూచించారు. మండలంలోని పెదదొడ్డిగల్లు సచివాలయాన్ని బుధవారం సందర్శించారు. ఆధార్ స్పెషల్ క్యాంపును పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. స్పందన దరఖాస్తు విచారించారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కోటవురట్ల: కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారిని సరితాదేవి కోరారు. ఈనెల 27 నుంచి వచ్చే నెల 20వ తేదీ లోపు ఆన్లైన్లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, ఎస్సీ ఎస్టీ మైనారిటీ వెనుకబడిన వర్గాల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని, తప్పనిసరిగా నిబంధనలు అనుసరించాలని తెలిపారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి

రోడ్డు విస్తరణపై మున్సిపల్ సమావేశంలో నిలదీసిన కౌన్సిలర్లు



ప్రశ్నిస్తున్న పద్మావతి



సమాధానం చెబుతున్న చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్ :మున్సిపాలిటీ సాధారణ సమావేశం అధికార, విపక్షాల వాగ్వావాదాలతో దద్దరిల్లింది. చైర్పర్సన్ ఆదిలక్ష్మి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ముందుగా అభీద్ సెంటర్ నుండి పెద్ద బొడ్డేపల్లి పెద్దమఠం వరకు రోడ్డు విస్తరణ తీర్మానంపై అజెండా వివరించారు. దీనికి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి, కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ, రోడ్డు విస్తరణను తెలుగుదేశం పార్టీ స్వాగతిస్తుందని, ఇందుకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. రోడ్డు విస్తరణతో నష్టపోతున్న వ్యాపారులు, షాపు యజమానులకు నష్టపరిహారంను నగదు రూపంలో చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. దీనికి వైసిపి కౌన్సిలర్ తమరాన నాయుడు, శెట్టి చినబాబు ఆమె మాటకు అడ్డు తగులుతూ అమరావతి లో మీరు ఏ విధంగా అమలు చేశారో ఇక్కడ కూడా తమ ప్రభుత్వంలోని అదే విధానం అమలు చేస్తుందన్నారు. అమరావతి రైతులకు ఇచ్చే విధంగానే ఇక్కడ నష్టపోయిన వారికి ఇస్తున్నామని తెలిపారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. 2019-20లో ఇచ్చిన జీవో ప్రకారం విస్తరణ పనులు చేపడుతున్నామని కమిషనర్ పేర్కొన్నారు. దీనికి చైర్పర్సన్ మాట్లాడుతూ, రోడ్ విస్తరణ పనులపై మున్సిపాలిటీ చైర్పర్సన్ అయిన తనకు ఇప్పటివరకు అధికారులు ఏమీ తెలియజేయలేదని అసహనాన్ని వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ రోడ్డు విస్తరణ పై తనకు ఎటువంటి సమాచారాన్ని కూడా ఇవ్వలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి అధికారులు ఏమీ చెప్పకుండా నీళ్లు నమిలారు. చైర్ పర్సన్ అధికారులను నిలదీస్తున్నప్పటికీ అధికార వైసిపి కౌన్సిలర్లు ఎవరూ ఆమె తరపున మాట్లాడక పోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. చైర్ పర్సన్ పై అదే పార్టీ కౌన్సిలర్లు వివక్ష చూపుతున్నారనే విషయం తేటతెల్లమయింది.

రోడ్డు విస్తరణ పనులను చైర్పర్సన్‌కు తెలియజేయక పోవడంపై సభ అనంతరం విలేకరులు కమిషనర్ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కౌన్సిలర్లకు అందరికీ ఈ విషయాన్ని తెలియజేశామని, రోడ్డు విస్తరణ పై చైర్పర్సన్‌కు తెలుసని, జనవరి 31న దీనిపై తీర్మానం కూడా చేయడం జరిగిందని ఆయన అన్నారు. సభం అనంతరం రోడ్డు విస్తరణకు నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించాలని చైర్పర్సన్, మున్సిపల్ కమిషనర్‌కు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు వినతి పత్రాన్ని అందించారు.

వినూత్న రీతిలో రామరాజు హాజరు

స్థానిక మున్సిపల్ సాధారణ సమావేశానికి 20వ వార్డు కౌన్సిలర్ రామరాజు తమ వార్డుకు కావలసిన డిమాండ్స్‌ను నెరవేర్చాలంటూ బ్యానర్ పట్టుకొని వినూత్న రీతిలో హాజరయ్యారు. దీనికి చైర్పర్సన్ ఆదిలక్ష్మి అసహనం వ్యక్తం చేస్తూ సభ సజావుగా జరగాలని, ఇటువంటివి సరైనవి కావన్నారు. సమస్యలను కౌన్సిలర్ సమావేశంలో తెలియజేస్తే మంచిదని ఆమె సూచించారు. దీంతో ఆయన మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా తమ వార్డుకు మంచినీటి, వీధి దీపాల సమస్య అధికంగా ఉందని, రోడ్డు సదుపాయం కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. లింగాపురం, కళ్లెంపూడి, సీతయ్య పాలెం గ్రామస్తుల తరపున తాను డిమాండ్ చేస్తున్నానని అన్నారు. ప్రభుత్వం బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరుస్తామన్న తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వార్డుకువస్తే సమాధానం చెబుతాం

మున్సిపల్ సమావేశం అనంతరం తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు దనిమిరెడ్డి మధు, శ్రీకాంత్, చింతకాయల పద్మావతి, పెదిరెడ్ల దివ్య, రాజు నాయుడు విలేకరులతో మాట్లాడుతూ, మున్సిపల్ కమిషనర్‌కు పారిశుధ్యం పై ఎన్నిసార్లు విన్నవించుకున్నా కనీసం స్పందించడం లేదని తెలిపారు. అన్ని వార్డులను సమానంగా చూడాలని, తమ వార్డులపై వివక్ష చూపుతున్నారని, నర్సీపట్నంలో పారిశుధ్య నిర్మూలనకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. ఎన్నిసార్లు చెప్పినప్పటికీ కమిషనర్‌కు తమ వార్డు ప్రజలపై కనీసం కనికరం లేదన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

రోడ్డు విస్తరణలో బాధితులకు అండగా ఉంటామని జనసేన పార్టీ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య విలేకరులకు తెలిపరు. రోడ్డు విస్తరణలో బాధితులకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో నష్టపరిహారం నగదు రూపంలో చెల్లించాలన్నారు. మున్సిపాలిటీలో ప్రజల సొమ్ము అక్రమార్జనకు గురవుతుందని, తప్పుడు లెక్కలు చూపిస్తూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఉత్తర వాహిని తీరంలో ఇటీవల శివరాత్రి కార్యక్రమాన్ని నిర్వహించి లక్షల రూపాయలు దోచేసారని విమర్శించారు.



నిరసన చేపడుతున్న గిరిజనులు

బోయ/వాల్మీకిలను ఎస్‌టిల్లో చేర్చొద్దు

ప్రజాశక్తి-మాడుగుల:బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం ఎం.గదబూరులో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సదరు కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చ కూడదని రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోకుండా తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. నాన్ షెడ్యూల్ ప్రాంతాన్ని షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోని ప్రభుత్వం ఓట్ల కోసం ఇటువంటి నిర్ణయం తీసుకుందని అన్నారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో వున్న 40 లక్షల మంది బోయ,వాల్మీకిలను ఎస్‌టిలలో చేర్చడం అన్యాయమన్నారు. గిరిజన వ్యతిరేక విధానాలను వీడి జిఓ 52 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎరయ్యమ్మ, సోమి నాయుడు, ఆదినారాయణ, భూలోకమ్మ, దేముదమ్మ పాల్గొన్నారు.



ఒపి వద్ద రోగులు

సిహెచ్‌సికి రోగుల తాకిడి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు (సిహెచ్‌సి)కి రోగుల తాకిడి అధికమైంది. గడిచిన 15 రోజులుగా నిత్యం 350 వరకు ఓపి వరకు వస్తున్నట్లు సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి తెలిపారు. సిహెచ్‌సికి 14 మంది వైద్యులు అందుబాటులో ఉండాల్సి ఉండగా పది మంది ఉన్నారని తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, కంటి డాక్టర్ ప్రస్తుతం అందుబాటులో లేరన్నారు. మందులు కొరత లేకుండా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా సరైన మౌలిక వసతులు సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రోగులు తెలిపారు. మరుగుదొడ్డి, తాగునీరు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి మౌలిక వసతుల కల్పనతో పాటు మెరుగైన వైద్యం అందజేయాలని పలువురు కోరుతున్నారు.

కవగుంటలో వైద్యశిబిరం

ప్రజాశక్తి -రావికమతం:ఫ్యామిలీ ఫిజీషియన్ మెడికల్ క్యాంపులను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. కవగుంట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రావికమతం పిహెచ్‌సి వైద్యాధికారి దుర్గాప్రసాద్ సుమారు 70 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ మెడికల్ క్యాంపు లను ప్రతి సచివాలయం పరిధిలోని నెలకు రెండు సార్లు వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ క్లినిక్ ఇంచార్జ్ వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి

జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని గాదంపాలెం, జోగంపేట, చీడిగుమ్మల పంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి బుధవారం సందర్శించారు. గాదంపాలెంలో సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంను విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక సమావేశం నిర్వహించి కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో వారంలో ఒక పంచాయతీని సందర్శించడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూలను వచ్చే నెల 15 తేదీ నాటికి పూర్తి చేయాలని ఆమె పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.వచ్చే నెల 15వ తేదీన 90 శాతం పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డేవిడ్‌రాజు, డిఎల్‌పిఓ ఎస్ఎస్.మూర్తి, ఈఒపిఆర్‌డి రఘురాం పాల్గొన్నారు.



సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న శిరీషారాణి

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-మాడుగుల:కాకినాడ జిల్లా తొండంగిలో హత్యకు గురైన నదిపల్లి రాజు కుటుంబానికి రాష్ట్ర మాల మహానాడు నేతలు మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, వ్యవసాయ భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సియాద్రి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీను, కార్యదర్శి పాము దాసు, జిల్లా విజిలెన్స్ అండ్ మొనటరింగ్ కమిటీ సభ్యులు, మాడుగుల కు చెందిన మరువాడ ఈశ్వరరావు, రాష్ట్ర రెల్లి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎర్రం శెట్టి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మాల మహానాడు నేతలు

వృథాగా తాగునీరు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలోని సీతారామరాజు నగర్‌లో గడిచిన రెండు మాసాలుగా తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాధుడే లేడని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించు కోలేదని దీంతో నిత్యం తాగునీరు వృథాగా మురుగునీటి కాలువలోకి పోతుందన్నారు. దీంతో పంచాయతీకి అధికంగా విద్యుత్ బిల్లు రావడమే కాక, భూగర్భ జలాలు అడుగంటుతాయన్నారు.



11న గొలుగొండ మండల సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11న మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఒ డేవిడ్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్యసమావేశంకు సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.



పరీక్షా సామగ్రి పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు 150 మందికి అట్టలు, పెన్నులు ఇతర పరీక్షా సామగ్రిని స్థానిక వైద్యాధికారి గాయత్రి ఆర్థిక సహకారంతో అందజేశారు. వీటిని విద్యార్థులకు ఆమెతో పాటు సహచర వైద్యాధికారి హరిప్రవీణ్, హెచ్ఎం భారతి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, టెన్త్‌తో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఉపాధ్యాయులు టివి.రమణ, రామరాజు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో బాలారం జడ్పీ హైస్కూల్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆనందోత్సాహాల నడమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. సొంత గ్రామానికి, స్కూల్‌కి మంచి పేరు తేవాలన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.



నృత్యం చేస్తున్న విద్యార్థులు